సర్వం చెత్తమయం

- గ్రామాల్లో అధ్వానంగా పారిశుద్ధ్యం
- కన్నెత్తి చూడని ప్రత్యేకాధికారులు

చీరాల టౌన్:

మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో ఎక్కడ చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో రెండు గ్రామ పంచాయతీలు మినహా మిగిలిన గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్మికులు సరిపడా లేకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే నిలిచి పోతోంది. మండలంలోని పంచాయతీల్లో ఈ సమస్య బాగా జటిలంగా మారింది. పారిశుద్ధ్య సిబ్బంది లేకపోవడంతో రోజురోజుకూ పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. గ్రామాల్లోకి ఎవరైనా జిల్లా అధికారో, ప్రజాప్రతినిధులు వస్తే మాత్రం కేవలం ఆ పరిసరాలను మాత్రం శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లిస్తున్నారు. మిగతా ప్రాంతాల్లో చెత్తను తీసే వారే లేకపోయారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో దేవాంగపురి, ఈపూరుపాలెం, గవినివారిపాలెం గ్రామాల్లో జనాభాతో పాటు ఆదాయం కూడా ఎక్కువే ఉంటుంది. కానీ ఈ గ్రామాల్లో పారిశుద్ధ్య సిబ్బంది అరకొరగా ఉండటంతో వీధుల వెంట చెత్తాచెదారం కనిపిస్తూనే ఉంది. చీరాల మున్సిపాలిటీకి చేరువగా ఉన్న రామకష్ణాపురం, సాల్మన్ సెంటర్ పంచాయతీల్లో కూడా ఈ దుస్థితి దాపురించింది. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారుల్లో కూడా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. పంచాయతీలకు ప్రభుత్వం మండల స్థాయి అధికారులైన ఎంపీడీఓ, ఈవోఆర్డీ, మండల విద్యాశాఖాధికారి, మండల వ్యవసాయాధికారి, మండల సీడీపీవోలను గ్రామాలకు ప్రత్యేకాధికారులుగా కలెక్టర్ నియమించారు. కానీ వారానికి ఒకసారి కూడా గ్రామాల వైపు కన్నెత్తి చూడటం లేదని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. జనసంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో, మంచినీటి పంపుల వద్ద చెత్తకుప్పలు పేరుకుపోవడంతో పాటు తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. అంతేగాక ఈ ప్రాంతాల్లో దోమలు వ్యాప్తి చెందడం వలన రోగాల పాలవుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధుల వెంట ఉన్న చెత్త కుప్పలను తొలగించి బ్లీచింగ్ చల్లించాల్సిన పారిశుద్ధ్య పర్యవేక్షకులు మొక్కుబడిగానే పని చేస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వీధుల వెంట ఉన్న చెత్త కుప్పలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



ఈపూరుపాలెం బైపాస్ రోడ్డులో చెత్తాచెదారాలతో కుప్పల వద్ద సంచరిస్తున్న పందులు



ప్రధాన రహదారిలో పేరుకుపోయిన చెత్తకుప్పలు

గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులు వీరే..

చీరాల మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులుగా మండల స్థాయి అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశాలతో నియమించారు. బుర్లవారిపాలెం, ఈపురుపాలెం, దేవాంగపురి గ్రామ పంచాయతీలకు ఎంపీడీఓ శివసుబ్రమణ్యం, పిట్టువారిపాలెం, తోటవారిపాలెం, గవినివారిపాలెం, దేవినూతల గ్రామ పంచాయతీలకు ఈవోఆర్డీ ఎ.రామకష్ణ, కొత్తపాలెం, విజయనగర్‌కాలనీ గ్రామ పంచాయతీలకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నక్కల నాగరాజు, రామకష్ణాపురం, కావూరివారిపాలెం పంచాయతీలకు సీడీపీవో కె.ఉమా, చీరాలనగర్, సాల్మన్‌సెంటర్ గ్రామ పంచాయతీలకు పి.సుబ్రమణ్యేశ్వరరావు ఎంఈవో, గాంధీనగర్, వాడరేవు గ్రామ పంచాయతీలకు ఐ.సుమతీ మండల వ్యవసాయాధికారిలను ప్రత్యేకాధికారులగా నియమించారని ఎంపీడీవో తెలిపారు.

సిబ్బంది లేకనే ఇబ్బంది

ఈ విషయమై మండల అభివృద్ధి అధికారి పి.శివసుబ్రమణ్యంను వివరణ కోరగా గ్రామాల్లో చెత్తకుప్పలు తొలగించేందుకు పారిశుద్ధ్య కార్మికులు సరిపడా లేరు. అయితే ఉన్నంతమంది సిబ్బందితోనే సమస్యను పరిష్కరిస్తున్నాం. వీధుల వెంట చెత్తాచెదారం వేయకుండా ప్రత్యేక కార్యక్రమం చేపట్టబోతున్నాం. ప్రజలు డస్ట్‌బిన్లు వినియోగించడంతో పాటు నివాస ప్రాంతాల్లో చెత్తకుప్పలుగా పేర్చవద్దు. సాధ్యమైనంత త్వరగా సమస్య పరిష్కరిస్తాం. ప్రత్యేకాధికారులు కూడా గ్రామాలను సందర్శించేలా కృషి చేస్తా.

పి.శివసుబ్రమణ్యం, చీరాల ఎంపీడీఓ

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

- సాక్షి కథనాలకు స్పందన



సాక్షిలో ఇటీవల ప్రచురితమైన కథనం



ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని స్టేషన్‌కు తరలిస్తున్న వీఆర్వో శివారెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

చీరాల టౌన్: మండలంలోని గ్రామాల్లో యథేచ్ఛగా ఇసుక అక్రమంగా అమ్మకాలు రవాణా చేస్తూ ప్రకృతి వనరులను దోచుకుంటున్నారని ‘సాక్షి’ పత్రికలో వరుసగా కథనాలు ప్రచురించింది. దీనిపై సీరియస్‌గా పరిగణించిన చీరాల ఆర్డీఓ టి.చంద్రశేఖరనాయుడు ఆదేశాలతో తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం తోటవారిపాలెం పరిధిలోని సైఫన్ కాలువ సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లును సీజ్ చేశారు. తహసీల్దార్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని 216 బైపాస్ రోడ్డు సమీపంలో తోటవారిపాలెం సైఫన్ కాలువ వద్ద రెండు ట్రాక్టర్లు ఇసుక తరలిస్తుండటంతో తోటవారిపాలెం గ్రామ రెవెన్యూ అధికారి ఎస్.శివారెడ్డి రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. బాపట్ల మండలం స్టూవర్టుపురానికి చెందిన బి.శివాజీ అక్రమంగా చీరాల మండలంలో ఇసుకను తరలిస్తూ అమ్మకాలు చేస్తున్నాడు. బేతపూడికి చెందిన వెంకటేశ్వరరెడ్డి, క్రాంతికుమార్ రెడ్డి ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తుండటంతో వీఆర్వో రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని రూరల్ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నా, క్వారీలు నిర్వహించిన వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని తహసీల్దార్ గోపికృష్ణ హెచ్చరించారు.

క్లుప్తంగా

నాటుసారాను అడ్డుకుంటాం

చీరాల: మండల కేంద్రం చీరాల ప్రాంతంలో నాటుసారా రవాణా, అమ్మకాలపై ఉక్కు పాదం మోపుతామని, నాటు సారా చీరాల్లో లేకుండా పనిచేస్తామని ఎక్సైజ్ సీఐ నాగేశ్వర రావు తెలిపారు. బుధవారం చీరాల మండలంలోని రామ్‌నగర్, ఆదినారాయణపురం, ఉజిలీపేట తదితర ప్రాంతాల్లో ఎక్సైజ్ సిబ్బంది విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. నాటుసారా అమ్మేవారు పద్ధతి మార్చుకుని ఇతర వృత్తులను ఉపాధిగా చేసుకుని జీవించాలని, సత్ప్రవర్తనతో మెలగాలని అవగాహన కల్పించారు. అలానే వేటపాలెం మండలంలోని పలు ప్రాంతాల్లో ఉన్న మద్యం దుకాణాలను పరిశీలించారు. మద్యం దుకాణాల వద్ద సిట్టింగ్‌కు అనుమతి లేదని, ఎక్కడైనా అనధికారంగా సిట్టింగ్ ఏర్పాటు చేస్తే లైసెన్స్ రద్దు చేయడంతో పాటు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థినులతో ఎంఈవో, ఉపాధ్యాయులు

అద్దంకి రూరల్: స్థానిక కాకానిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ తయారు చేసిన స్టడీ మెటీరియల్‌ను బుధవారం ఎంఈఓ బి. సుధాకర్ అందజేశారు. మండలంలోని రాళ్లపల్లి ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సోమేపల్లి హనుమంతరావు 60 మంది విద్యార్థులకు మెటీరియల్ అందించేందుకు సహకరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గరవయ్య, మండల యూటీఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల సుస్థిర పాలనకు కృషి



శిక్షణలో పాల్గొన్న అన్ని శాఖల అధికారులు, సిబ్బంది

కారంచేడు: గ్రామాల అభివృద్ధి, సుస్థిర పాలనకు పాలకులతో పాటు, గ్రామ స్థాయి అధికారులు, సిబ్బంది సమష్టి కృషి అవసరమని ఎంపీడీఓ కె. నేతాజీ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన కారంచేడు మండల పరిషత్ సమావేశపు హాలులో నిర్వహించిన శిక్షణ తరగతుల్లో మాట్లాడారు. పంచాయతీల్లో సర్పంచ్‌లు, కార్యదర్శుల సహకారం అవసరమన్నారు. ప్రభుత్వ సహకారంతో గ్రామాల్లోని మౌలిక వసుతుల కల్పనకు కట్టుబడి ఉండాలన్నారు. సీడీపీఓ తిరుమలశెట్టి ఝాన్సీ, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



పుస్తకాలతో దాత కొర్రపాటి వెంకటేశ్వరావు, తదితరులు

యద్దనపూడి: పుస్తక పఠనం వల్ల విద్యార్థుల మేధోశక్తి పెరుగుతుందని ప్రధానోపాధ్యాయుడు ఏఎం. శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పూనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం దాత కొర్రపాటి వెంకటేశ్వరావు రూ.10 వేలు విలువైన పుస్తకాలు , రూ.5 వేలు విలువైన కుర్చీలు, ఇతర సామగ్రిని పాఠశాలకు అందజేశారు. గతంలో పాఠశాలలో ఉన్న గ్రంథాలయానికి దాత వెంకటేశ్వరావు ఎన్నో విలువైన పుస్తకాలను అందజేశారని కరోనా కారణంగా మూతబడిన పాఠశాల గ్రంథాలయానికి మరలా పుస్తకాలు అందజేయడం అభినందనీయమని కొనియాడారు. విద్యార్థులు పుస్తకాలను సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కొర్రపాటి అంకమ్మ, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆట వస్తువుల పంపిణీ

పర్చూరు(చినగంజాం): పర్చూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నాగులపాలెంలోని ఎస్ఎస్ఆర్‌పీ బధిరుల పాఠశాలలో విద్యార్థులకు బుధవారం ఆటవస్తువులను పంపిణీ చేశారు. బుధవారం క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ కుమార్తె మౌనిక జన్మదిన పురస్కరించుకొని అందించారు. కోమటి ఆంజనేయులు, హెచ్ఎం ఉమాదేవి, నాగభైరు శ్రీనివాసరావు, పంబి సదానందరెడ్డి, పాబోలు వెంకన్న సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

బల్లికురవ: బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వరి, జూట్, మూర్పిళ్లు నాలుగు రోజులు వాయిదా వేసుకోవాలని వ్యవసాయాధికారి ఎస్‌వీపీ కుమారి కోరారు. బుధవారం నక్కబొక్కలపాడు మల్లాయపాలెం గ్రామాల్లో పొగాకు, కంది, జూట్ వరిపొలాలను పరిశీలించారు.

లింగవివక్షను వ్యతిరేకించండి

మార్టూరు:జండర్ ఆధారిత హింసను స్త్రీ, పురుష భేదం లేకుండా వ్యతిరే కించడం సామాజిక బాధ్యత అని కొలలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు బుధవారం ప్రదర్శన నిర్వహించారు. పిల్లలపై లైంగిక వేధింపులు, మానవ అక్రమ రవాణా, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు.

సీనియర్ పాత్రికేయుడు రాఘవరావుకు నివాళి



రాఘవరావు కుటుంబ సభ్యులతో నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాలాజీ

పర్చూరు(చినగంజాం): పర్చూరుకు చెందిన సీనియర్ పాత్రికేయుడు తులసి రాఘవరావు(59) బుధవారం మృతి చెందారు. అనారోగ్యంతో చికిత్స పొందుతూ గుంటూరు ఆసుపత్రిలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పలువురు పాత్రికేయులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తెన్నారు. రాఘవరావు గత 17 సంవత్సరాలుగా పాత్రికేయ వృత్తిలో ఉండి ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, వార్త, సూర్య, కాకతీయ, మనం తదితర దిన పత్రికల్లో పనిచేశారు. శాతవాహన స్కూల్ కరస్పాండెంట్ తేళ్ళ వెంకట రాము, పాత్రికేయులు కె. రామకృష్ణంరాజు, కె. సుబ్బారావు, షేక్ అయూబ్, కే రవి, ధనుంజయ, బి. నాగేశ్వరరావు, వై. శామ్యూలు, వీరభద్రం తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

పర్చూరు (చినగంజాం): పర్చూరుకు చెందిన సీనియర్ పాత్రికేయుడు తులసి రాఘవరావుకు వైఎస్సార్ సీపీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ యడం బాలాజీ నివాళులర్పించారు. బుధవారం రాఘవరావు భౌతిక కాయంపై పుష్పగుచ్ఛం ఉంచి సంతాపాన్ని వ్యక్తం చేశారు. మండల పార్టీ కన్వీనర్ కఠారి అప్పారావు, గోపాలం లక్ష్మీదీపక్, గాజుల రమేష్, కోటా శ్రీనివాసరావు, ముప్పాళ్ళ రాఘవరావు, మల్లా శ్రీనివాసరావు, కుంచనపల్లి రమేష్, గోగుల పూర్ణ, కొల్లా శ్రీహరి తదితరులున్నారు.



పాత్రికేయుడు తులసి రాఘవరావు (ఫైల్)

విత్తన శుద్ధితో చీడపీడలు దూరం



అలవలపాడులో అధికారులు, రైతులు



పర్చూరు: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు

జె.పంగులూరు: విత్తన శుద్ధి చేయడం ద్వారా మొదటి దశలోనే పంటను పురుగుల నుంచి కాపాడవచ్చని మండల వ్యవసాయాధికారి డి. సుబ్బారెడ్డి అన్నారు. మండల పరిధిలోని అలవలపాడు, జాగర్లమూడివారిపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. మండల వ్యవసాయాధికారి డి. సుబ్బారెడ్డి మాట్లాడుతూ రైతులు సాగుచేసిన మొక్కజొన్న పంటలో ఎక్కువగా కత్తెర పురుగు కనిపిస్తుందని దిని నివారణకు సైంట్రానిలిప్రొల్ 19.8 శాతం, థయామెథాక్సామ్ 19.8 శాతం కలిపి విత్తన శుద్ధి చేయాలన్నారు. దీని ద్వారా మొదటి దశలోనే పంటను పురుగు నుంచి కాపాడుకోవచ్చన్నారు. రబీ కాలంలో వరి పంట సాగు చేసే రైతులు ఎకరాకు రూ. 126, మొక్కజొన్నకు ఎకరాకు రూ. 105, శనగ ఎకరాకు రూ. 84 మీ సేవాలో బీమా తప్పక చేయించుకోవాలన్నారు. సమావేశంలో వ్యవసాయాశాఖ సిబ్బంది దిల్జా, ఫిలిప్స్, మార్కెటింగ్ శాఖ సిబ్బంది ఇతర రైతులు పాల్గొన్నారు.

పర్చూరు (చినగంజాం): రైతులు పంట సాగు చేపట్టబోయే ముందుగా భూమిని సారవంతంగా చేసుకోవాలని పర్చూరు వ్యవసాయ శాఖ ఏడీఏ ఎన్. మోహనరావు అన్నారు. బుధవారం చింతగుంటపాలెం, పెద్దివారిపాలెం గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడారు. రైతులు ప్రతి మూడు సంవత్సరాలకు ఒక సారి తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పచ్చి రొట్ట ఎరువులతో సాగు చేసుకొని సారవంతం చేసుకోవాలని తెలిపారు. వ్యవసాయాధికారి రామ్మోహనరెడ్డి, ఆదర్శ గ్రామ రైతులు, సిబ్బంది మధు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: శనగలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ సూచించారు. కోటికలపూడి, కుంకుపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు తులసీ సర్పంచ్ గాలం శ్రీను పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

బల్లికురవ: గ్రామాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో కుసుమకుమారి అన్నారు. బుధవారం స్థానిక పరిషత్ కార్యాలయంలో 21 గ్రామ పంచాయతీల్లోని క్లాప్ మిత్ర, సెక్రటరీలకు ఐటీసీ బంగారు భవిష్యత్‌పై అవగాహన దస్సు నిర్వహించారు. ఈవోఆర్డీ, ఐటీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

అద్దంకి రూరల్:అద్దంకి పట్టణంలో బుధవారం రెండు వేర్వేరు ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. మండలంలోని తిమ్మాయపాలెం గ్రామ సమీపంలోని ఇటుక బట్టీల వద్ద బైకు మీద వెళుతున్న వ్యక్తిని పాఠశాల వాహనం తగలటంతో స్వల్ప గాయాలయ్యాయి. అద్దంకి- నార్కెట్‌పల్లి నామ్ రహదారిపై అద్దంకి నుంచి నరసరావుపేట వెళుతున్న ఆర్టీసీ బస్సు శింగరకొండ మలుపువద్ద లారీఢీకొన్నాయి. లారీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి.

బాలాజీని కలిసిన రాంబాబు



బాలాజీకి జ్ఞాపిక అందిస్తున్న పాలెపోగు రాంబాబు

పర్చూరు(చినగంజాం): పర్చూరు నియోజక వర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ యడం బాలాజీని ఆ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాలెపోగు రాంబాబు బుధవారం రాత్రి కలిశారు. తాను రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమించిన సందర్భాన్ని పురస్కరించుకొని బాలాజీకి పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి జ్ఞాపికను అందజేశారు. పర్చూరు నియోజకవర్గ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ కొల్లా వెంకట్రావు, చినగంజాం మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి, హేమంత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

అందరూ అక్షరాస్యులుగా మారాలి



శిక్షణ ప్రారంభంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసమూర్తి

చినగంజాం: గ్రామాల్లో ఉన్న నిరక్షరాస్యులను, అక్షరాస్యులుగా మార్చే బృహత్తర కార్యక్రమంలో గ్రామ సంఘాల లీడర్లు భాగస్వాములు కావాలని ఎంపీడీఓ ఏవీ శ్రీనివాసమూర్తి కోరారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ప్రారంభించిన ఉల్లాస్ అనే అక్షర వెలుగు కార్యక్రమంపై వీఓఏలకు స్థానిక వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. శిక్షకుడు మనోరంజన్, ఎంఈఓ కోటేశ్వరరావు, ఏపీఎం సుబ్బారావు, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

వైభవంగా పడి మహోత్సవం




ప్రత్యేక అలంకరణలో అయ్యప్ప స్వామి మందిరం

వేటపాలెం: స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో గల వెంకటేశ్వర్లు స్వామి దేవస్థానం ప్రాంగణంలో అయ్యప్ప స్వామి నాలుగో పడి మహోత్సవం బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. అయ్యస్వామి మందిరాన్ని అరటి బోదెలతో ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

బల్లికురవ: సర్వమానవాళి మనుగడకు క్రీస్తు బోధనలు అనుసరణీయమని బల్లికురవ చర్చి పాస్టర్ బండారు సురేష్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొవ్వొత్తులతో ప్రార్థనలు చేపట్టారు. క్రిస్మస్ కేకు కట్ చేసి ముందస్తుగా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. క్రీస్తు బోధనలను నేటి యువత ఆచరిస్తూ శాంతి మార్గాన్ని ఎంచుకోవాలని పాస్టర్ పిలుపునిచ్చారు. బల్లికురవ ఏపీఎం రాజారావు, మార్టూరు ఏపీఎం సురేంద్ర బాబు సీసీలు వీఓఏలు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



మోటుపల్లిలో అర్జీలందుకుంటున్న ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు



దేవాంగపురిలో మాట్లాడుతున్న తహసీల్దార్ గోపీకృష్ణ

చీరాల టౌన్: భూ సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు మీభూమి–మీహక్కు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని, తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ తెలిపారు. మండలంలోని దేవాంగపురి గ్రామ పంచాయతీ సచివాలయం వద్ద బుధవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. విలువైన భూముల రికార్డులను భద్ర పరచాలన్నారు. గ్రామ పరిధిలో ప్రజలకు ఉన్న 9 భూ సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించారు. డిప్యూటీ తహసీల్దార్ దేవతోటి అర్జున్, గ్రామ ప్రత్యేకాధికారి ఐ.సుమతీ, మండల సర్వేయర్ చెరుకూరి బ్రాహ్మణయ్య, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

చినగంజాం: ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని సద్వినియోగం చేసుకోవాలని చీరాల రెవెన్యూ డివిజనల్ అధికారి తూమాటి చంద్రశేఖర్ నాయుడు అన్నారు. బుధవారం మండలంలోని మోటుపల్లి గ్రామంలోని పంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామ రెవెన్యూ సదస్సు తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అధ్యక్షతన నిర్వహించారు. సదస్సులో మొత్తం 74 అర్జీలు రాగా వాటిలో భూమి సర్వే చేయాలని కోరుతూ 17, కులధ్రువీకరణ సర్టిఫికెట్ల కోసం 40, 1బీ అడంగల్ కోసం 16, ఆదాయ సర్టిఫికెట్ కోసం 1 వచ్చాయి. కార్యక్రమంలో మండల సర్వేయర్ సుబ్బారావు, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సహాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



విగ్రహ ప్రతిష్టా వేడుకల సమయంలో ఆప్రాంతంలోకి వచ్చిన వానరం



అభయాంజనేయస్వామి విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

చీరాల టౌన్: మండలంలోని ఈపురుపాలెం పంచాయతీలోని స్టూయిట్‌కట్ సమీపంలోని శ్రీ వీరహనుమాన్ నగర్‌లో నిర్మాణం చేసిన 63 అడుగుల శ్రీ అభయాంజనేయస్వామి వారి విగ్రహ ప్రతిష్టాపన మొదటి వార్షికోత్సవ వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. మొదటి వార్షికోత్సవ ప్రతిష్టా మహోత్సవాలను పండితుల మంత్రోచ్ఛరణలతో శాస్త్రోక్తంగా జరిపించారు. కాగా ఆ ప్రాంతంలో ఓ వానరం ఆ సమయంలో ప్రత్యక్షమవడంతో దానికి కూడా పూజలు చేశారు. అది ప్రసాదం స్వీకరించడంతో సాక్షాత్తు ఆంజనేయుడే స్వీరించినట్లు భక్తులు ఆనందించారు. అనంతరం హోమాలు నిర్వహించారు.

అనుమతులు లేకుండా విక్రయిస్తే చర్యలు



పర్చూరు : ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న వ్యవసాయ శాఖ కమిషనరేట్ అధికారులు




చీరాల: ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న వ్యవసాయాధికారులు

చీరాల రూరల్: ఎటువంటి అనుమతులు లేకుండా రైతులకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీనియర్ ఏడిఏ (సీడ్స్) కేఎల్. సుదర్శన్ రాజు పేర్కొన్నారు. బుధవారం చీరాల మండలంలోని అన్ని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీలు చేశారు. నకిలీ ఎరువులు, పురుగుల మందులు విక్రయించినా, తూకాల్లో తేడాలు వచ్చినా, స్టాక్ రిజిస్టర్‌లో వ్యత్యాసాలు వచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రత్యేక తనిఖీ వ్యవసాయాధికారి కమల్‌రాజు, స్థానిక వ్యవసాయాధికారి సుమతి, సిబ్బంది పాల్గొన్నారు.

పర్చూరు (చినగంజాం): ఎరువుల దుకాణాల్లో అమ్మకాలు స్టాక్ రిజిస్టర్ ప్రకారం జరగాలని వ్యవసాయ శాఖ కమిషనరేట్ ఏడీఏ సుదర్శనరాజు అన్నారు. బుధవారం మండలంలోని ఎరువుల దుకాణాలను కమిషనరేట్ ఆఫ్ అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఇ-పాస్ మిషన్‌లను అపడేట్ చేయాలని, రైతులతో వేలి ముద్రలు కచ్చితంగా వేయించుకోవాలని సూచించారు. కమిషనరేట్ ఏఓ కమల్ రాజు, పర్చూరు వ్యవసాయ శాఖ ఏడీఏ ఎన్. మోహనరావు, మండల వ్యవసాయాధికారి రామ్మోహనరెడ్డి పాల్గొన్నారు.

పోషణ వనాలతో పౌష్టికాహారం



కొత్తమల్లాయపాలెంలో అన్నప్రాసన చేస్తున్న సీడీపీ

బల్లికురవ: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు అంగన్‌వాడీ కేంద్రాల్లో సేంద్రియ విధానంలో పోషణ అందించాలని ఐసీడీఎస్ సంతమాగులూరు సీడీపీవో దాసరి సుధ అన్నారు. బుధవారం కొత్తమల్లాయపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ వనాన్ని పరిశీలించి సంతృప్తి చెందారు. ఓ చిన్నారికి అన్నప్రాసన చేశారు. ప్రాజెక్టు పరిధిలో చవిటిపాలెం మెయిన్, వెల్లలచెరువు ఎస్సీ, బల్లికురవ ఎస్సీ, కొత్తమల్లాయపాలెం, కె.రాజుపాలెం, నక్కబొక్కలపాడు జనరల్, సోమవరప్పాడు, అంజడపూడి ముక్తేశ్వరం గ్రామాల్లోని ఎస్సీ కేంద్రాలు పోషణ వనాల కింద ఎంపిక చేశామని చెప్పారు. ఒక్కో కేంద్రానికి పదివేల రూపాయలు అందజేశామని ఆకు కూరలు, పండ్ల మొక్కలను పెంచాలన్నారు.